


డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

# కిటికీ

పొద్దున్న అయిదు గంటలకే నిద్ర లేచి, స్నానం, పూజ ముగించి మొగుడికీ, పిల్లలకీ కాఫీ, ఫలహారం వంటి సేవలు ముగించి, వంట వండి ముగ్గురికీ కారియర్లలో సర్ది ఆయనగార్ని ఆఫీసుకూ, పిల్లలను స్కూలుకూ పంపించేసరికి పరుగుపందెంలో పాల్గొన్నంతగా అలసిపోతుంది జలజ.

ఇంకా చేయవలసిన పనులు బోలెడన్ని తన కోసం ఎదురు చూస్తున్నా, గడయారంలో సమయం తొమ్మిదిన్నర చూపిందంటే పరుగు పరుగున ముందు గదిలో దక్షిణం వైపున్న కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడి మూడో ఇంటి వైపు చూడడం ఆమె దినచర్యలో భాగంగా మారింది.

సరిగ్గా తొమ్మిదిన్నర అయ్యేసరికి వీధిగుమ్మం తలుపు తీసి బయటకు వస్తాడు అతను. ఆరడుగులు పొడుగు, పొడవుకు తగ్గ దృఢమైన శరీరం, కొద్దిగా రాగి రంగులో ఉండే జుత్తు, ఆడ పిల్లల కంటి రెప్పలకున్నట్టు పొడవైన ఐలాషెస్, పెద్ద కళ్లు, చక్కని శరీర ఛాయతో అమ్మాయిల గుండె వేగంగా స్పందింప చేయగల అందం అతనిది. అందానికి తగ్గ హుందాతనం అతనిలో ఉట్టిపడుతుంటుంది. వీటన్నిటికీ తోడు అతను ధరించే ఖరీదైన దుస్తులు పదిమందిలోను అతన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి.

అతను బయటకు వచ్చి కారు స్టార్ట్ చేయగానే లోపలి నుండి బయటకొచ్చి తలుపు తాళం వేసి భర్త పక్కన సీట్లో వయ్యారంగా కూర్చుంటుంది అతని అర్ధాంగి.

ఇంచుమించు తన వయసు ఉంటుంది ఆవిడకు. అయినా తనలా నాలుగేళ్లలో ముగ్గురు పిల్లల్ని కని ఈకలు పీకిన కోడిలా తయారుకాలేదు.

ముప్పై ఏళ్లు దాటినా కాలేజీ పిల్లలా, సంతూర్ సబ్బు అమ్మాయిలా నవనవలాడుతున్నది. రోజూలాగే ఆ రోజూ అనుకుంటూ, అలవాటుగా నిట్టూర్చి వెనక్కి తిరిగి వంటింట్లోకి నడిచింది జలజ.

ఆవిడ విరహాన్ని ఆ కాసేపూ భరించలేనట్టు తన పక్కన కార్లో కూర్చోగానే ఒక చేతితో స్టీరింగునదుపు చేస్తూ మరో చేయి ఆమె భుజం చుట్టూ వేస్తాడతను.

వాళ్లు ఈ కాలనీలో ఇల్లు కొనుక్కుని వచ్చి ఏడాది దాటింది. ఇల్లు చూస్తే ఇంద్రభవనంలా ఉంటుంది. ఆ ఇంటి ఇల్లాలేమో లక్ష్మీదేవికే అసూయ పుట్టేలా ఏడు వారాల నగలు చీరలతో ధగధగలాడిపోతుంటుంది.

పిల్లలకు మొగుడికి పెట్టగా మిగిలిన ఉప్మా చప్పగా చల్లారిపోయినా పట్టించుకోకుండా తినేసి నీళ్ల గదిలోకి వచ్చిన జలజకు గుట్టలా పడి ఎదురుచూస్తున్న మాసిన బట్టలు చూడగానే నీరసం వచ్చింది.

ఏం సుఖపడిపోతోందని తను ఈ పెళ్లి చేసుకుని? పెళ్లి కాక ముందు ఎన్ని కలలు కన్నది తను? మనువాడిన మగనితో జీవితం మూడు సినిమాలు, ఆరు షికార్లుగా గడిచిపోతుందనుకుంది. ఇంజినీరుగా పనిచేస్తున్నాడంటే అన్ని వైభోగాలు తనవే అనుకుంది మొదటి సంబంధం చూసినప్పుడు. ఆ డిగ్రీ కొనుక్కోడానికి పెట్టిన ఖర్చు కట్నం రూపంగా రాబట్టాలన్న వాళ్ల ఆశ తీర్చలేక వదులుకున్నారు. ఇంకో అతను లెక్చరరు. ఆదర్శాలు అవతలివారికి చెప్పేందుకే గానీ తను పాటించడానికి కాదని నమ్మిన వాడు. అతనికేం పెట్టనక్కర్లేదుట గానీ అమ్మాయి పేరు మీద ఇంటి స్థలం కొని పెట్టమన్నాడు. కారులో కాకపోయినా కనీసం స్కూటరు మీద తిరగవచ్చునన్న ఆశ కూడా అడియాసగా మారింది. చివరకు ఇదిగో ఇతగాడిని రాసి పెట్టాడు తనకు ఆ బ్రహ్మ. బావిలో కప్పలా ఇల్లు, ఆఫీసు తప్ప మరో విషయం పట్టకుండా బ్రతికేస్తాడు.

జలజ ఆలోచించుకుంటూనే బట్టలన్నీ ఉతికి ఆరేసింది. ఇల్లంతా సర్దింది. పిల్లల యూనిఫాంలు ఇస్త్రీ చేసి పెట్టింది. కాసేపు టీవీ ముందు కూర్చుంది. అంతలోనే సమయం నాలుగు కావడంతో పిల్లలకి సాయంకాలం, తినడానికి ఏవన్నా చేసి పెట్టాలని మళ్లీ వంటింట్లోకి దూరింది.

నాలుగున్నరకల్లా అల్లరిగా అరుచుకుంటూ వచ్చారు పిల్లలు. వాళ్లను బట్టలు మార్చుకోమని, కాళ్లూ చేతులు కడుక్కోమని, తినడానికి పెట్టి ఆటలకు పంపించే సరికి ఆయనగారొచ్చారు.

జలజ మాటా పలుకూ లేకుండానే అతనికీ కాఫీ, ఫలహారం అందించింది. గడియారంలో పెద్ద ముల్లు పన్నెండు మీదకి చిన్నముల్లు ఆరుమీదకీ చేరుతున్నాయి. అలసట తీరడానికి చల్లనీళ్లతో ముఖం కడుక్కోవాలనుకున్నదల్లా ఆ పని పక్కన పెట్టి ముందు గదిలో దక్షిణం వైపు కిటికీ దగ్గరకు వచ్చి నిలబడింది.

అంతలోనే మూడో ఇంటి ముందుకు వెండి వెన్నెల రంగు కారు వచ్చి ఆగింది. అతను ముందు దిగి అటు తిరిగి వచ్చి ఆవిడ దిగడానికి కారు తలుపు తెరిచాడు. సుకుమారంగా దిగిందామె. ఇద్దరూ చెట్టపట్టాలు వేసుకుని కిలకిల నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ లోపలకు వెళ్లారు.

అయినా జలజ అక్కడి నుండి కదలలేదు. ఆమెకు తెలుసు కాసేపట్లో ఆ జంట బయటకు వస్తారని. ఉదయం కట్టిన చీరె మార్చి గులాబి రంగు చుడీదార్లో మెరిసిపోతూ బయటకు వచ్చిందామె. అతను కూడా సాయంకాలానికి తగిన డ్రెస్‌లో ఆమె వెనుకనే బయటకు వచ్చాడు. ఇద్దరూ కువకువలాడుతూ కారెక్కి వెళ్లిపోయారు.

మళ్లీ వాళ్లు రాత్రి పదింటివరకు రారని తెలుసు. గనుక కిటికీ రెక్కలు మూసేసి, ఎగసి వస్తున్న నిట్టూర్పు అణచుకుంటూ లోపలికి వచ్చింది జలజ.


ముందు వరండాలో కూర్చుని పేపరు చదువుతున్న ఆమె భర్త శివరావు తలెత్తి ఒక క్షణం ఆమెవైపు చూసి మళ్లీ పేపరు చదవడంలో మునిగిపోయాడు.

ఒక్కనాడన్నా ఈయనకు సరదా పుట్టదా పెళ్లాన్ని వెంట బెట్టుకుని ఎటైనా వెళ్లి తిరిగి రావాలని. పెళ్లైన కొత్తలో అతనితో దెబ్బలాడేది. అలిగేది. మరీ తప్పనిసరైతే సినిమాకు తీసికెళ్లే వాడుగానీ ఒక మాట పలుకు లేకుండా ఉండే సద్దిబువ్వ లాటి మొగుడి పక్కన కూర్చుని సినిమా చూడ్డంలో జలజకు ఏ ఆనందం కలిగేది కాదు.

మూడో ఇంట్లో ఉన్న అరవింద ఏం ఉద్యోగం చేస్తోందో గానీ పొద్దున్న వెళ్లినప్పుడు ఎంత తాజాగా ఉత్సాహంగా ఉంటుందో సాయంత్రం ఇంటికి చేరేటప్పుడు కూడా అలాగే ముఖం మీది పౌడరు కూడా చెదరకుండా ఉంటుంది. బహుశా భర్త పెట్టిన కంపెనీలోనే చేస్తోందేమో.

మూడేళ్ల క్రిందట అతను, అంటే అరవింద భర్త పాణి దుబాయ్ వెళ్లక ముందు వాళ్లూ చాలా మామూలుగా ఉండే వాళ్లుట. అసలు భార్యను పట్నం తీసుకురాకుండా పుట్టింట్లోనే ఉంచేడట. దుబాయి వెళ్లి బాగా సంపాదించుకొచ్చాక వాళ్ల జీవితమే మారిపోయిందట. ఇక్కడ ఇల్లు కొన్నాక భార్యను తీసుకొచ్చి కాపరం పెట్టాడట. పనిమనుషుల ద్వారా వచ్చిన వార్త ఇది.

పేపరులోనే ప్రపంచమంతా ఉందన్నట్టు చదువుతున్న శివరావును చూస్తే జలజకు ఒళ్లుమండింది. తమ పెళ్లైన కొత్తలో ఈయనకూ మస్కట్ వెళ్లే అవకాశం వచ్చింది. అతను చదివింది ఇంజినీరింగు డిప్లొమా అయినా మంచి ఉద్యోగమే దొరికింది. అప్పటికి తను మొదటిసారి కడుపుతో ఉంది. ఎలాగూ పురిటికి పుట్టింటికి వెళ్లాలి. ఏడో నెలలో వెళ్లి బిడ్డకు అయిదో నెలలో తిరిగి వస్తుంది. అంటే ఏడు నెలలు పుట్టింట్లో ఉండనే ఉంటుంది. మహా అంటే మరొక ఏడాదిపాటు అక్కడే



ఉండిపోతాననీ అతగాడిని వెళ్లి రమ్మని చిలకకు చెప్పినట్టు చెప్పింది. తన అమ్మానాన్నలతో చెప్పించింది. రెండేళ్లు సంపాదించుకు వస్తే జీవితం సుఖంగా గడిచిపోతుందని ఎందరు చెప్పినా వినలేదు శివరావు.

సంపాదన కన్నా జీవితం ముఖ్యం అన్నాడు. పుట్టబోయే బిడ్డ ముఖమైనా చూడకుండా ఎక్కడో ఊడిగం చేసి సంపాదించడం వలన ఎలాంటి సుఖం ఉండదన్నాడు. ఉన్న దానిలో తన భార్యా పిల్లలతో తృప్తిగా బ్రతకడమే తనకు ఇష్టమన్నాడు.

అందుకే ఈ రోజు తామింత గొప్పగా బ్రతుకుతున్నారు. తెలివిగా అవకాశం ఉపయోగించుకున్న పాణి, అరవింద ఐశ్వర్యంలో ఆనందంలో ఓలలాడుతున్నారు.

ముక్కు తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్లిన జలజ ఒక క్షణం అలా నిలబడి పోయింది. రాత్రి కూర వండడానికి కడిగి ఉంచిన బెండకాయలు సన్నగా తరిగి ఉన్నాయి. స్టౌ మీద కుక్కర్ విజిల్ వేయడానికి సిద్ధంగా ఉంది. తను కిటికీ దగ్గర నిలబడి ఉన్నప్పుడు చప్పుడు కాకుండా వచ్చి ఈ పనులు చేసి పెట్టి వెళ్లి కూర్చున్నాడన్నమాట ఈయన. మనసులోని కోపం కరిగిపోగా కూర వేయించడానికి పూనుకుంది జలజ.

సరదాలు సరసాలు లేకపోయినా ఇంటి పనులలో సాయపడతాడు. ఈ ఆడంగి పనులు చేయకపోతే ఆ పాణిలా డబ్బు సంపాదించే మార్గం వెతుక్కో వచ్చుగా? అనుకుంటే మళ్లీ అసంతృప్తి అలుముకుంది జలజ మనసు నిండా.

మర్నాడు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు టంచనుగా కిటికీ ముందు నిలబడిన జలజకు మూడో ఇంటి ముందు గుంపుగా జనం కనబడి కంగారు పడింది.

ఎవరో నలుగురు మనుషులు సాయం పట్టి పాణిని మోసుకొచ్చి బయట పడుకోబెట్టారు. వాళ్ల వెనకనే ఏడుస్తూ బయటకు వచ్చింది అరవింద.

జలజకు కాళ్లలో వణుకు పుట్టింది. గబగబ తలుపుతీసుకుని వీధిలోకి వచ్చింది. తెల్లవారుఝూమున గుండె పోటొచ్చిందట అతనికి. హాస్పిటల్‌కి తీసుకెళ్లే సరికే పోయాడట.

“తాగి తాగి సచ్చిపోయాడమ్మా.. పగలు రేత్రి అదే పని.. ఇట్లా అయితే పోతావు అని డాక్టరు చెప్పినా ఇనలేదంట.” అటు పోతున్న పనిమనిషి జనాంతకంగా చెప్పి పోయింది.

సాయంత్రం వరకు శవాన్ని కదపలేదు. ఊరి నుండి అతడి తల్లితండ్రీ రావాలని పెట్టేరు. గుండెలు బాదుకుంటూ శోకాలు పెడుతూ వచ్చిన ముసలి దంపతులతో బాటు వాళ్ల కోడలు, మనవళ్లు దిగారు కారు. ఆ వచ్చినావిడ పాణి భార్య అని తెలిసి జలజకు నోటి మాట రాలేదు. ముత్యాల్లా ఉన్న

పది, పన్నెండేళ్ల అబ్బాయిలిద్దరూ పాణి నోటి నుండి ఊడిపడినట్టున్నారు. మరో కార్లో పాణి అత్తమామలు, బంధువులు దిగారు. వచ్చిన వాళ్లంతా కలిసి అరవిందను ఇంట్లో నుండి బయటకు తరిమేశారు. దుబాయి నుండి వచ్చాక డబ్బు మదంతో ఈడవిడను చేరదీశాడట పాణి. అతను తనను పెళ్లి చేసుకున్నాడనీ అందుకు సాక్ష్యాలు ఉన్నాయనీ, వాళ్లంతా కలిసి ఎంత గొడవ చేసినా అతని ఆస్తిలో తనకు వాటా రాకుండా చేయలేరని అరుస్తోంది అరవింద.

ఆ క్షణంలో రోజూ తను ఎంతో ఆరాధనతో చూసే అరవింద కాకుండా మరొక కొత్త మనిషిని చూస్తున్నట్టు అనిపించింది జలజకు.

ఏడ్చి ఏడ్చి ఎర్రబడిన కళ్లతో, నలిగిపోయిన వెంకటగిరి జరీ చెరలో, ముఖాన కుంకుమ బొట్టు, చేతులకు బంగారు గాజుల నడుమ మట్టి గాజులు వేసుకుని ఉన్న పాణి భార్య అతని శవం పక్కన కూర్చుని రెప్పవేయకుండా అతని ముఖంలోకే చూస్తూ, ఎగసి పడుతున్న దుఃఖాన్ని అణుచుకుంటోంది.

అరవింద అరుపులు గానీ, తన అత్తమామలు ఆమెను పెడుతున్న శాపనార్థాలు ఏవీ ఆమె చెవిని సోకుతున్నట్టు లేవు.


మగపిల్లలిద్దరూ బిక్కముఖం పెట్టి అమ్మకు చెరో వైపు చేరి ఆమె ఒడిలో తలపెట్టి ఏడుస్తూ అప్పుడప్పుడు నానమ్మ తాతయ్యల వైపు, వాళ్లతో పోట్లాడుతున్న ఆమె వైపు బితుకూ బితుకూ చూస్తున్నారు.

అయినవాళ్లు వచ్చాక కార్యక్రమం యథావిధిగా మొదలైంది. చీకటి పడక ముందే పాణిని వైకుంఠ రథం ఎక్కించారు.

చెట్టంత భర్త హఠాత్తుగా తన జీవితం నుండి నిష్క్రమించడం నిజమేనని అప్పటికి మనసులకి ఇంకిందేమో రథం కదిలిపోగానే కుప్పకూలిపోయిందా ఇల్లాలు. అదివరకటిలా పిల్లల కోసమైనా నెలకోసారి వచ్చి నాలుగు రోజులుండే మనిషి ఇక ఎప్పటికీ రాడన్న సత్యం ఆశనిపాతంలా సోకిందా ఇల్లాలికి.

ఇక ఆమె దుఃఖాన్ని చూడలేనట్టు ఇంట్లోకి పరిగెత్తుకు వచ్చి నీళ్ల గదిలోకి దూరింది జలజ.

స్నానం చేశాక కాస్త కుదుటపడి స్కూలు నుండి వచ్చిన పిల్లలేం చేస్తున్నారని చూసింది.



ఇంట్లో సిద్ధంగా ఉన్న దోసెపిండితో పిల్లలకి దోసెలు చేసి పెట్టి, వాళ్లను హోంవర్క్ చేసుకోమని కూర్చోబెట్టాడట శివరావు. పిల్లలు గుసగుసలతో చెప్పారు.

వంటింట్లోకి వచ్చి చూసేసరికి స్టౌ మీద బంగాళాదుంప ముక్కలు మూకుడులో వేగుతున్నాయి. మరొకవైపు కుక్కర్ అరవడానికి యత్నం చేస్తోంది.

శివరావు యథాప్రకారం వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు.

అతని పక్కన వచ్చి కూర్చుంది జలజ.

"పాపం గుండెపోటుతో పోయాట్ట కదా! ఈ అరవిందను చేరవేశాక నెలకోసారి మొక్కుబడిగా పెళ్లాం పిల్లల్ని చూసి వచ్చేవాట్ట... పాపం ఆవిడకి ఇప్పుడు ఆమాత్రం ఊరట కూడా లేకుండా చేశాడు దేవుడు. పేపరులో నుండి తలెత్తకుండానే అన్నాడు శివరావు.

జలజ ఆశ్చర్యపోయింది. ఇల్లూ ఆఫీసు తప్ప మరేం తెలియదనుకుంది ఈయనకు. ఈ విషయాలన్నీ ముందే తెలిసినా ఏనాడూ ఒక్క మాటు తనతో అనలేదు. ఆ కిటికీ దగ్గర నుండి లోపలికి వచ్చాక ఎన్నోసార్లు అతని మీద, జీవితం మీదా విసుక్కుంది. పరోక్షంగా అతని అసమర్థతను ఎత్తిచూపింది.

జలజకు కళ్లలో నీళ్లు తిరిగాయి. భర్తకు మరికాస్త దగ్గరగా జరిగి కూర్చుని అతని చేయి తన చేతిలోకి తీసుకుంది. "మీరు మస్కట్ వెళ్లకపోయినా, డబ్బు సంపాదించకపోయినా మనం పిల్లలు కలిసి ఉన్నాం. సుఖంగా ఉన్నాం. అంతే చాలు. దేవుడి దయ వలన ఇలా గడిచిపోతే చాలు నాకు" అంది గద్గదికంగా.

శివరావు ఆమె తల మీద చేయి వేసి నిమిరాడు. "వేరే దేశానికి వెళ్లి డబ్బు సంపాదించే వాళ్లందరూ పాణిలా ప్రవర్తించరు పిచ్చీ! నాకు డబ్బు కన్నా మనందరం కలిసి ఉండడం ముఖ్యం. అంతే!" అన్నాడు.

జలజ మౌనంగా లేచి వెళ్లి ముందు గదిలో ఉన్న దక్షిణం వైపు కిటికీ తలుపులు గడియవేసి, వంటింట్లో తన కోసం ఎదురుచూస్తున్న పనిలో పడింది.

○

# పాపం శ్రియ!

ఒక్కోసారి తారలు సినిమాల్లో నటించేందుకు అడ్వాన్సులు తీసుకుని, డేట్లు ఇవ్వకుండా నిర్మాతలను ఏడ్పించడం చేస్తుంటారు. తాజాగా శ్రియ కూడా ఇలాగే ఓ తమిళ నిర్మాతను సతాయించి చివరికి 5 లక్షల ఫైన్‌ని కట్టాల్సి వచ్చిందిట. కదిరేశన్ అనే నిర్మాత శ్రియతో సినిమా తీయదలచి ఆమెకి 10 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాట్ట. కానీ శ్రియ తనకి ఖాళీ లేదంటూ చాలా కాలంగా డేట్లు ఇవ్వకుండా తిప్పుతుండడంతో కదిరేశన్ నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేశాట్ట. కేసుని పరిశీలించిన కౌన్సిల్ వారు శ్రియ తీసుకున్న 10 లక్షలకి మరో ఐదు లక్షలు జతచేసి సదరు నిర్మాతకి ఇవ్వాల్సిందిగా తీర్పు చెప్పడంతో చేసేదేం లేక శ్రియ అలాగే చేసిందిట.